సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 1 । జనవరి । 2024



కృష్ణావతార అలంకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూనీలా సమేత జనార్దనస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి శ్రీకృష్ణావతార అలంకరణ చేశారు.



ఘనంగా అన్నసమారాధన

పాలకొల్లు అర్బన్: మండలంలోని నాగరాజుపేటలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద షష్టి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, పాలపొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

శ్రీవారికి తులసి సేవ



తులసి గజమాలను తీసుకొచ్చిన గోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకురాలు

ద్వారకాతిరుమల: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని చినవెంకన్నకు నిత్యం తెల్లవారుజామున గోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకురాలు సునీతా మధుసూదన్‌లు తులసి గజమాల (వనమాల)ను సమర్పిస్తున్నారు. గత ఎన్నిదేళ్లుగా ఈ సేవను కొనసాగిస్తున్నారు. హిందూధర్మ ప్రచారంలో భాగంగా శ్రీవారి ఆలయంతో పాటు ఈ ధనుర్మాసంలో ప్రముఖ వైష్ణవ ఆలయాలైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి, పెద్ద తిరుపతి గోవిందరాజ స్వామికి, మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహ స్వామికి ఈ తులసి గజమాలలను అందిస్తున్నారు. విజయవాడలోని భవానీపురానికి చెందిన సునీతా మధుసూదన్‌లు అక్కడున్న 10 ఎకరాల తోటలోని తులసిని సేకరించి, సేవకుల ద్వారా వాటిని గజమాలలుగా మలచి వైష్ణవాలయాలకు అందజేస్తున్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో) : రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి పొంది జాతీయ స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌కు ఎంపికైన చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్, జిల్లా సైన్సు అధికారి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్పందన రద్దు

భీమవరం: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి పోలీస్ స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదివారం తెలిపారు. స్పందనకు వచ్చే అర్జీదారులు గమనించాలని కోరారు.

జనవరిలో టీఎల్‌ఎం మేళా



డీఈఓ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందచేస్తున్న పీటీఐ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికన ఆర్ట్, క్రాఫ్ట్ టీఎల్‌ఎం మేళాను జనవరిలో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు. ఏలూరు జిల్లా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో శ్యామ్‌సుందర్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్, కన్వీనర్ నక్కా రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పీటీఐలకు నెలవారీ గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులను ప్రతినెలా మండల విద్యాశాఖాధికారికి ఇవ్వడానికి ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. మహిళా ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవులు సాధ్యమైనంత త్వరలో అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్యామ్ సుందర్ పీటీఐల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ ఈఈగా వెంకటేశ్వర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ పరిధిలో ఏలూరు క్వాలిటీ కంట్రోల్ -4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా టీ.వెంకటేశ్వర రావును బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ ఇమ్మడి పృథ్వీతేజ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న వీ.సత్య సాయిబాబాకు పదోన్నతి కల్పించి విశాఖపట్నంలో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు.

కొత్త వత్సరం.. కోలాహలం



'మధుర'స్మృతులను మిగిల్చేలా.. భీమవరంలో కేక్ దుకాణాల వద్ద రద్దీ



ఆనందం వెల్లి'విరి'సేలా.. భీమవరంలో బొకేల దుకాణం

హ్యాపీ న్యూఇయర్ అంటూ ఆనందోత్సాహాలు మిన్నంటాయి.. కొత్త సంవత్సర వేళ సంబరాలు అంబరాన్నంటాయి.. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా న్యూఇయర్ సందడి కనిపించింది. ఊరూవాడా విద్యుత్ కాంతులు, బాణసంచా కాల్పులు, రంగవల్లుల శోభతో అలరించాయి. జిల్లావాసులు మదినిండా మధుర స్మృతులతో 2023కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ.. కోటి ఆశలతో 2024కు నవ వసంతం.. కావాలి మన సొంతం అంటూ స్వాగతం పలికారు.

- జిల్లావ్యాప్తంగా న్యూఇయర్ సందడి
- కిటకిటలాడిన మార్కెట్లు
- పార్టీలతో యువత కేరింత
- కోటి ఆశలతో 2024కు స్వాగతం

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా ఆదివారం పండగ వాతావరణం కనిపించింది. మాల్స్, హోటళ్లు, బంగారు, వస్త్ర, బొకేలు, పండ్లు, స్వీట్స్ దుకాణాలు, బేకరీలు వినియోగదారులతో కిక్కిరిశాయి. జిల్లాలో రూ.25 కోట్లకుపైగా న్యూఇయర్ వ్యాపారం జరిగినట్టు అంచనా. భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డు, మల్టీప్లెక్స్ ఏరియా, డీఎన్‌ఆర్ కళాశాల రోడ్డు, నాచువారి సెంటర్, ఆదివారం బజార్‌లు కోలాహలంగా మారాయి. నరసాపురంలో బంగారం విక్రయాలు జోరందుతున్నాయి. తణుకులో రాష్ట్రపతి రోడ్డు, పాలకొల్లులో బస్టాండ్ సెంటర్, నరసాపురంలోని స్టీమర్ రోడ్, తాడేపల్లిగూడెం వన్ టౌన్‌లోని కేఎన్ రోడ్డు, తాలుకాఫీస్ రోడ్డులు కిటకిటలాడాయి. తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్, హార్టీకల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. క్రైస్తవ మందిరాలను సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జోరుగా మాంసాహార విక్రయాలు

డిసెంబర్ 31 ఆదివారం కలిసిరావడంతో మాంసాహార విక్రయాలు గతేడాది కన్నా మిన్నగా జరిగాయి. పట్టణం, పల్లె తేడాలేకుండా రెస్టారెంట్లు, హోటళ్లలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేశారు. న్యూ ఇయర్ స్పెషల్ ప్యాక్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లను వ్యాపారులు ప్రకటించారు.

మరింత పథకాల లబ్ధి

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ కొత్త ఏడాది కానుకలను ప్రజలకు అందించనున్నారు. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచారు. అలాగే ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచగా దీనికి సంబంధించి జిల్లాలో 5.82 లక్షల మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులను అందించనున్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను ఈనెలలో నిర్వహించనున్నారు.

మళ్లీ మురిపించెన్

కొత్త సంవత్సరంలో పింఛన్‌దారుల మోముల్లో కొంగొత్త ఆనందాల్ని నింపుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలు చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తానిచ్చిన హామీని అమలు చేస్తూ వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, మత్స్యకారులకు పింఛన్ మొత్తాన్ని కొత్త ఏడాది నుంచి రూ.3,000 చేశారు. టీడీపీ హయాంలో కేవలం రూ. వెయ్యి పింఛన్ సరిపోక ఇబ్బంది పడిన లబ్ధిదారుల ఇక్కట్లు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.2,250 చేశారు. ఇప్పుడు రూ.3 వేలకు పెంచడంతో పింఛనుదారుల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి.



ఆకివీడు నగర పంచాయతీ సచివాలయం-4లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భువన సుందరి(ఫైల్)

- జనవరి నుంచి రూ.3000 పింఛన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పెంపుతో రూ.4.67 కోట్ల అదనపు భారం
- జిల్లాలో మొత్తం 2,24,144 మంది పింఛన్‌దారులు
- పరిశీలనలో 9,215 కొత్త పింఛన్‌లు

ఆకివీడు: అంచెలంచెలుగా పింఛన్ పెంపును కొనసాగిస్తామని చేసిన వాగ్దానాన్ని అమలుజేస్తూ 2024 జనవరి నుంచి రూ. 3,000 పింఛను మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకోవాలంటే తెల్లవారుజాము నుంచే పంచాయతీల వద్ద పడుగాపులు పడాల్సి వచ్చేది. వృద్ధులు అవస్థలు పడుతూ పింఛన్ సొమ్ము కోసం ఎండ, వానలో కార్యాలయాల వద్ద ఎదురు చూడాల్సి వచ్చేది. నాలుగైదు రోజులు తిప్పుకునేవారు. ఇప్పుడు తెల్లవారకముందే వలంటీర్లు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందిస్తున్నారు. వృద్ధులు టీడీపీ హయాంలో నెలవారీ ఖర్చులకు ఇబ్బంది పడేవారు. మందులకు, ఇతర అవసరాలకు డబ్బులు సరిపోని దుస్థితి ఉండేది. ఇప్పుడు పింఛన్ మొత్తాన్ని మూడింతలు చేయడంతో వారి ఖర్చులకు పోనూ మిగతా సొమ్మును దాచుకుంటున్నారు.

జిల్లాలో పింఛన్‌దారులు : 2,24,144

నెలవారీ చెల్లిస్తున్న మొత్తం: రూ.61.27 కోట్లు

జనవరి 2024 నుంచి నెలకు చెల్లించనున్న సొమ్ము: రూ. 65.93 కోట్లు.

ప్రభుత్వానికి అదనపు భారం రూ.4.67 కోట్లు

జనవరిలో మంజూరయిన కొత్త పింఛన్లు(పరిశీలన): 9,215 మంది

జిల్లాలో పింఛన్‌దారులు

వృద్ధాప్య	1,22,781
వితంతు	46,591
అభయ హస్తం	8,356
డయాలసిస్ రోగులు(ప్రభుత్వ)	151
డయాలసిస్ రోగులు(ప్రైవేటు)	248
డప్పు కళాకారులు	284
దివ్యాంగులు	26,560
అనారోగ్యంతో ఉన్నవారు	2,043
మత్స్యకారులు	4,394
వృద్ధ కళాకారులు	113
మిలటరీ సంక్షేమ ఫింఛన్	20
ఒంటరి మహిళలు	6,684
కల్లు గీత కార్మికులు	2,895
చెప్పులు కుట్టే కార్మికులు	299
హిజ్రాలు	32
చేనేత కార్మికులు	2,691

దరఖాస్తు చేసిన నెలకే పింఛన్



వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్‌కు అర్హులని దరఖాస్తు చేయించారు. నెల రోజులకే పింఛన్ సొమ్ము తీసుకువచ్చి ఇచ్చారు. ఎంతో ఆనందంగా ఉంది. గతంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు పడేవారం. పింఛన్ వచ్చిన తరువాత తీసుకునేందుకు మరింత ఇబ్బంది పడేవారం. ఇప్పుడు ఆరు నెలలకే రూ. 3 వేలు అందుకుంటున్నందుకు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– యర్రా నాగరాజు, వృద్ధుడు, సాలిపేట, ఆకివీడు

జిల్లాలో 9,215 కొత్త పింఛన్లు



జిల్లాలో కొత్తగా 9,215 పింఛన్లు మంజూరయ్యాయి. ఆయా పింఛన్‌దారుల దరఖాస్తుల్ని ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయనున్నారు. జనవరి నుంచి రూ.250 పెంచడంతో రూ.3000 చొప్పున పంపిణీ చేయనున్నారు. జిల్లాలో అదనంగా రూ. 4.67 కోట్ల పింఛన్ సొమ్ము మంజూరు కానుంది.

– ఎం.వేణుగోపాల్, పీడీ, డీఆర్‌డీఏ, పశ్చిమగోదావరి జిల్లా

మాటతప్పరని రుజువు చేసుకున్నారు



సీఎం జగన్ మాటతప్పరని మరోసారి రుజువు చేసుకున్నారు. జనవరి నుంచి రూ.3000 పింఛన్ పెంచుతూ తీసుకున్న నిర్ణయం వృద్ధులకు ఎంతో అండగా ఉంది. పింఛన్ ఇంటికి తీసుకువచ్చి తెల్లవారుజామునే అందజేయడం సంతోషంగా ఉంది. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అభినందనలు

–పెన్మెత్స సుబ్బరాజు, అయిభీమవరం, ఆకివీడు మండలం

అండగా పింఛన్ సొమ్ములు



ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.3000 నా ఖర్చులకు సరిపోతుంది. పింఛన్ సొమ్ము పెంచడం ఎంతో ఆనందంగా ఉంది. వితంతువులకు ప్రభుత్వం ఇస్తున్న ఈ పింఛన్ ఆధారంగా నిలుస్తోంది. సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– లంక సత్యవతి, వితంతువు, ఆకివీడు

వైభవంగా శ్రీవారి తిరువీధి సేవలు



అధ్యయనోత్సవాల్లో భాగంగా క్షేత్ర పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు, ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి తిరువీధి సేవలు ఆదివారం వైభవోపేతంగా జరిగాయి. ధనుర్మాసం సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో క్షేత్ర పుర వీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగారు. ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది.

కొత్త సంవత్సరంలో మరింత అభివృద్ధి

కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ

దెందులూరు: నూతన సంవత్సరంలో నవరత్న పథకాల అమలతో పాటు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరింత అభివృద్ధి, సంక్షేమం చేస్తారని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో నూతన సంవత్సరం రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులతో పాటు ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అభివృద్ధి, సంక్షేమం నూరు శాతం అందాలని ఆకాంక్షించారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని ఎంపీ కోరారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి



బాలోత్సవంలో రోప్ స్కిప్పింగ్ దృశ్యం



బాలోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భీమవరం: బాలలు శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలుగా తయారుకావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాలోత్సవం రెండో రోజు కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని మాజీ ప్రిన్సిపాల్ ఎస్వీ రమణారావు ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలో స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు స్వామి జ్ఞానానంద, అయ్యగారి సాంబశివరావు, ఎల్లాప్రగడ సుబ్బారావు వంటి వారు జన్మించి ప్రపంచానికి దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. అటువంటి వారి ప్రేరణ బాలోత్సవంలో బాలలకు అందించాలన్నారు. అనంతరం మ్యాజిక్, మ్యూజిక్ షోలు అలరించాయి. సంగీత విద్వాంసుడు పిప్పళ్ల ప్రసాద్ స్వాతంత్ర్య సమర గేయాన్ని ఆలపించారు. అనంతరం మత సామరస్యం ప్రబోధించే పాట పాడారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ బత్తిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలందరూ రేపటి భావి భారత పౌరులు అని, బాలోత్సవం ద్వారా ఉత్తమ పౌరులుగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని దేశానికి ఖ్యాతిని తీసుకురావాలన్నారు. ముందుగా జీసీపీ శేఖర్ రాజు ఆధ్వర్యంలో రోప్ స్కిప్పింగ్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రాజును సత్కరించారు. శనివారం నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వీ రమణారావు తదితరులు అందించారు. కార్యక్రమంలో వేలాది మంది బాల బాలికలతో పాటు బాలోత్సవం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు, కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గాతల జేమ్స్, చెరుకువాడ రంగసాయి, చైతన్య ప్రసాద్, సీహెచ్ సాయిరాం, అల్లూరి అరుణ్, జి.ధనుష్, కలిగట్ల గోపాల శర్మ, చాన్ బాషా, మల్లుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు

దెందులూరు: దెందులూరు మండలం గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ 67వ వార్షికోత్సవాలను ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తారని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కమిటీ సమావేశం నిర్వహించి తేదీలను ఖరారు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు జంగారెడ్డిగూడెం రూట్‌లో వీఆర్వో విష్ణు ఇంటి నుంచి నేరుగా అమ్మవారి ఆలయానికి వచ్చేలా దాతలు గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతుల ఆర్థిక సాయంతో రోడ్డు నిర్మించామన్నారు.

సాబ్జి చిరస్మరణీయుడు

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ దివంగత సాబ్జి చిరస్మరణీయుడని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కొనియాడారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షేక్ సాబ్జి సంస్మరణ సభ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మోషేన్ రాజు మాట్లాడుతూ శాసన మండలిలో ఉద్యోగ, ప్రజా సమస్యలపై సాబ్జి ప్రస్తావించేవారని, ప్రశ్నించే ఉద్యమనేత అని కొనియాడారు. ఆయన అకాల మరణం దురదృష్టకరమన్నారు. సాబ్జి లేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి నిమిషం వరకు ప్రజా ఉద్యమాలలోనే పనిచేశారని, ప్రజల కోసం పనిచేసిన ఆదర్శప్రాయుడని నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, కార్యదర్శి బి.సుభాషిణి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమలులోకి 30 పోలీస్ యాక్ట్

భీమవరం: జిల్లాలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రవిప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

రూ.100 కోట్లతో రోడ్ల నిర్మాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.100 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చెప్పారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిలకంపాడు లాకుల నుంచి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్ల రహదారి, బాదంపూడి నుంచి ప్రత్తిపాడు వరకు రహదారి నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే తాడేపల్లిగూడెం నడిబొడ్డున పది ఎకరాల్లో అన్ని హంగులతో అతిపెద్ద పార్కు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న పంపుల చెరువుకు అదనంగా మరో 70 ఎకరాల్లో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు రూ.75 కోట్లతో పూర్తిగా సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులతో ఆధునిక డిజైన్లు పనులు చేపడతామన్నారు. వచ్చే నెల నుంచి ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. తొలుత డిప్యూటీ సీఎం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. సత్యవతినగర్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని ఆదివారం రాత్రి మంత్రి దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మార్గశిర మాసం అమ్మవారికి ప్రీతికరమైన మాసం అన్నారు. ఆలయ కమిటీ కోరిక మేరకు ఆలయం నుంచి కుంచనపల్లి మార్గంలో రోడ్డు నిర్మాణం, సత్యవతినగర్ నుంచి ఏరియా ఆసుపత్రి వరకు రూ.కోటితో సీసీ రోడ్డు, ఇరువైపులా సీసీ డ్రెయిన్లు నిర్మించామన్నారు. మహాలక్ష్మినగర్ నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు రూ.85 లక్షలతో తారు రోడ్డు నిర్మించామన్నారు. విజయవాడ శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దన్‌రావు, నాయకులు కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, చెన్నా జనార్దనరావు పాల్గొన్నారు.


గూడెంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

జూదరుల అరెస్టు

చింతలపూడి: మేడిశెట్టివారిపాలెం శివారులోని ఆయిల్‌పామ్ తోటలో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై కె.ప్రసాద్ దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24,550 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టండి

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో ఆర్ అండ్‌బీ రోడ్ల నిర్మాణాలను వెంటనే మొదలుపెట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. ఆదివారం తన కార్యాలయంలో ఆర్ అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముదునూరి మాట్లాడారు. రూ.12 కోట్లతో నిర్మించే కాళీపట్నం-జగన్నాథపురం, అలాగే రూ.20 కోట్ల నిధులతో చేపట్టిన లక్ష్మణేశ్వరం-పెదమైనవానిలంక రోడ్డు పనులు చేపట్టి వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన నరసాపురం-కరింశెట్టివారిపాలెం, అలాగే నరసాపురం-తూర్పుతాళ్ల రోడ్డు పనులు రెండు రోజుల్లో మొదలుపెట్టాలని ఆదేశించారు. అలాగే మొగల్తూరు మండలం కొత్తోట, జిల్లేడుతిప్ప, వెంప, కాళీపట్నం రహదారుల అభివృద్ధికి రూ.9 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటితో పాటు మెట్రేవు సీషోర్ రోడ్డు పనుల టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, ఆర్‌అండ్‌బీ అధికారులు లోకేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.


నరసాపురంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

తల్లికి అంత్యక్రియలు చేసిన తనయ

పాలకొల్లు సెంట్రల్: తల్లికి తలకొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లులో 22వ వార్డు కొత్తపేట ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి బాపయ్య నాయుడు (న్యాయవాది), భార్య పుణ్యవతిదేవి (60) దంపతులకు చైతన్య ఒక్కతే కుమార్తె. బాపయ్య నాయుడు అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో భార్య పుణ్యవతిదేవి శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుండెనొప్పితో మృతి చెందింది. కుమార్తె చైతన్య అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఇటీవల హైదరాబాద్‌కు షిఫ్ట్ అయింది. ఆదివారం తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె వెంటనే హైదరాబాద్ నుంచి పాలకొల్లు చేరుకుంది. తండ్రి మంచంపై లేవలేని స్థితిలో ఉండటం, సోదరులు లేకపోవడంతో అన్నీ తానై తల్లి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించింది.


తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న కుమార్తె చైతన్య

కిటకిటలాడిన బీచ్‌లు

మొగల్తూరు: మండలంలోని వైఎస్సార్ బీచ్‌లుగా పేరుగాంచిన పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. వాతావరణం అనుకూలంగా ఉన్నా చలిగాలులు తీవ్రంగా ఉండటంతో సందర్శకులు బీచ్‌లకు వచ్చినా ఎక్కువ సేపు సముద్ర స్నానం చేయలేదు. సముద్ర స్నానం అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.


పర్యాటకులతో రద్దీగా ఉన్న పేరుపాలెం బీచ్

అడిషనల్ ఎస్పీ సుబ్బరాజుకు సన్మానం

భీమవరం: ప్రజల మన్నన పొందేలా ఏఎస్పీ సుబ్బరాజు సేవలందించారని ఎస్పీ రవిప్రకాష్ అన్నారు. జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఏవీ సుబ్బరాజు బదిలీ అయిన సందర్భంగా భీమవరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఏఎస్పీ సుబ్బరాజు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేశారని అభినందించారు. అనంతరం సుబ్బరాజు దంపతులను సన్మానించారు. అదే విధంగా వీఆర్‌ఎస్‌పై రిటైర్ అవుతున్న హెచ్‌సీ బి.సుదర్శన్‌రావును సన్మానించారు. అనంతరం జరిగిన జిల్లా నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఆక్వా రైతులను కేంద్రం ఆదుకోవాలి

గణపవరం: ఆర్థిక నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులను కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని పలువురు ఆక్వా రైతులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులకు మొరపెట్టుకున్నారు. ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఎ.ఉదయకుమార్, ఎంఆర్ఎస్ బాబు ఆదివారం గణపవరం ఆర్‌బీకేలో ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలను, ఆక్వా రంగంలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల జనవరి 2వ తేదీన ఆక్వా అభివృద్ధిపై చేపట్టిన సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా భీమవరంలో పర్యటించి ఆక్వా పరిశ్రమ సమస్యలపై రైతులతో చర్చించనున్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వివిధ మండలాలలో పర్యటించి ఆక్వారంగ సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా రైతులు రొయ్యలకు గిట్టుబాటుధర కల్పించాలని, ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, నాణ్యమైన సీడ్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆక్వా రైతులకు రుణాలు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తెలిపిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఫిషరీస్ అధికారి శివరామకృష్ణ, మత్స్యశాఖ సహాయకులు షర్మిలాదేవి, భాస్కర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్న సమారాధన



అన్నసమారాధనకు భారీగా విచ్చేసిన భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని సత్యవతినగర్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రత్యేక వంటకాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించిన అన్నసమారాధనకు భక్తులు సుమారు 5వేల మంది పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆభరణాలు ఊరేగింపు



అయ్యప్పస్వామివారి ఆభరణాల పెట్టెను ఊరేగిస్తున్న గురుస్వామి ఇంటి శ్రీనివాసరావు

అత్తిలి: అయ్యప్పస్వామివారి ఆభరణాలు ఊరేగింపు ఉత్సవం ఆదివారం అత్తిలిలో వైభవంగా నిర్వహించారు. అత్తిలి శివాలయం సమీపంలోగల అయ్యప్పస్వామి దేవాలయం నుంచి స్వామివారి ఆభరణాల పెట్టెను మేళతాళాలు, పేటతుళ్లి ఆడుతూ అయ్యప్ప భక్తులు గ్రామంలో ఊరేగింపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి ఇంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆభరణాల ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి



కొమరవరంలో జరిగిన యూత్ క్రిస్మస్ వేడుకలలో పాల్గొని కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: ప్రతి ఒక్కరూ యేసుక్రీస్తు బోధనలను ఆచరించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలోని బైబిల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ క్రిస్మస్ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, గ్రామ సర్పంచ్ కరిబండి రాజేశ్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం అనంద్‌కుమార్, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



తణుకులో విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: మానవత సంస్థ విద్యా నిధి ద్వారా ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు అక్కాపంతుల బాలాజీ తెలిపారు. బాలాజీ అధ్యక్షతన ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో మానవత సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తణుకు శ్రీ కరి డయోగ్నస్టిక్ అధినేత బోగవల్లి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని మానవత సేవలను అభినందించారు. జేఈఈలో మంచి ర్యాంక్ సాధించి పంజాబ్‌లోని శాంట్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న సరెళ్ల రిషికుమార్‌కు రూ.30 వేలు, భీమవరం బీవీ రాజు కళాశాలలో ఎంఎస్సీ చదువుతున్న లంక గౌతమ్ సాయికు రూ.30 వేలు కళాశాల ఫీజుల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కేరీర్ గైడెన్స్ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి, రీజియన్ కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి, ఎస్వీ సతీష్ బాబు, చైర్మన్ వీవీ రామకృష్ణారావు, అక్కిన కాశీవిశ్వనాథం, కే రాజరాజేశ్వరరావు, బీ రామకాశీ, కేవీ రమణమూర్తి, శారదాదేవి, ఏడుకొండలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు



తణుకు రైల్వే స్టేషన్‌లో వృథాగా పోతున్న తాగునీరు

తణుకు: ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు నిర్వహణకు నోచుకోవడం లేదు. తణుకు రైల్వేస్టేషన్‌లోని రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ఇటీవల రైల్వే ఆధునీకీకరణ పనుల్లో భాగంగా రూ. కోట్లు వెచ్చించి రైల్వే స్టేషన్లను రైల్వే శాఖ ఆధునికీకరించింది. ఇందులో భాగంగా తణుకు రైల్వే స్టేషన్ సైతం ఆధునికీకరించారు. అయితే అరకొరగా పనులు చేపట్టడంతో పాటు తాగునీటి కుళాయిలు నాణ్యత లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. దీంతో ప్లాట్‌ఫారం నాటుపట్టి దర్శనమిస్తోంది. ప్రయాణీకులు సైతం ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

18 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 18 మంది వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, కె సావరం గ్రామాల్లో పర్యటించి వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా అసోసియేషన్ సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరుతా

బీజేపీ నాయకుడు గమిని సుబ్బారావు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజలకు సంతృప్తిని కల్గిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు గమిని సుబ్బారావు చెప్పారు. సీఎం అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడునై త్వరలో వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు తగు ప్రాధ్యానత్య ఇచ్చే విషయంలో గూడెంలో ఆర్యవైశ్యులకు టికెట్టు కేటాయించినా గెలిచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సామాజికపరంగా కాపులు అత్యధిక సంఖ్యలో ఉన్నా అధికారం విషయంలో అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తే మంచిదని చెప్పారు. నియోజకవర్గంలో కొట్టు నాయకత్వంలోను, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కార్యక్రమాలకు ఆకర్షితుడనై త్వరలో వైసీపీలో చేరుతున్నానని, త్వరలో వివరాలు ప్రకటిస్తానని వెల్లడించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



అన్నసమారాధనలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల నరసింహమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో దక్షిణ ముఖ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆదివారం హనుమాన్ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల నరసింహమూర్తి, పులగం బుచ్చిరెడ్డి, వట్టి బుజ్జి, ఆదిత్యకుమార్, శేషు, దేవేంద్ర తదితరులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు మనకు మాత్రమే ఉంది



గజమాలతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. వైఎస్సార్ సీప భీమవరం మండల యూత్ అధ్యక్షుడిగా నియమితులైన జవ్వాది గణేష్ ఆదివారం పార్టీ శ్రేణులతో వచ్చి క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా గణేష్ ను అభినందించిన ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని కూడా పార్టీ కచ్చితంగా గుర్తుంచుకుంటుందని ఆయన పేర్కొన్నారు. 2019 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలు అన్నింటిని కూడా అమలు చేశామన్నారు. ముందుగా గజమాలతో గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, నాయకులు చెలంకూరి హనుమాన్ చెలంకూరి సత్తిబాబు, ఒడుగు ముత్యాలరాజు, కొప్పర్తి సూరిబాబు, కొప్పినేని ఆదినారాయణ, యాతం త్రిమూర్తులు, కొప్పర్తి రంగారావు, కొప్పర్తి ప్రసాద్, కొప్పర్తి సుబ్బారావు, చె లంకూరి చిట్టయ్య, రామాయణం బుజ్జి, రేవు శీను, సంగాని బద్రి, మాండ్రు శీను, వర్ధనపు డేవిడ్ రాజు, సంధి దానియేలు, మాండ్రు యేసుపాదం, కాటిక సురేష్, నీతి పూడి రమేష్, బీమాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): నియోజవర్గ ప్రజలకు ,పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు , శ్రేయోభిలాషులకు , అధికారులకు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఈ నెల 4 నుంచి పింఛన్లు అందజేత



తాడేపల్లిగూడెం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పింఛన్లను అందజేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మూడో దఫాగా గతంలో ఇస్తున్న పింఛన్‌కు రూ.250లను పెంచి రూ.3వేలను ఈ నెల 4వ తేది నుంచి పంపిణీ చేయనున్నారు. 2023 డిసెంబరు వరకు తాడేపల్లిగూడెం అర్బన్‌లో 9561, మండలంలో 12,917మందికి పింఛన్లు అందజేస్తూ వచ్చారు. జనవరి నుంచి తాడేపల్లిగూడెం మండలంలో మరో 264 పింఛన్లు పెరగనున్నాయి. దీంతో 13,181 పింఛన్లు అందించనున్నారు. జనవరి నెలకు సంబంధించి మూడు కోట్ల 95లక్షల 43వేల రూపాయలను జమ కానున్నాయి.

ఆరా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో దేశ విదేశాలలో అనేక మందికి యోగ విద్యను అందిస్తున్న ఆరా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కరిబండి రామకృష్ణ ఆదివారం పట్టణంలోని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో పలువురి ఆధ్యాత్మిక వేత్తలను, సేవా రంగంలో పనిచేసిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, యెగ్గిన నాగబాబు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో ఆదివారం రాత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను జోరుగా.హుషారుగా ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, లక్కీడిప్‌లు జరిగాయి. అర్ధరాత్రి కేక్ కటింగ్ చేశారు. కవులు, కళాకారులు, పట్టణ ప్రముఖులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు ఏఎన్ఎస్ సత్యనారాయణ

అత్తిలి: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధుల సంక్షేమం కోసం కేంద్రం చేసిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఏఎస్ఎస్ సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కొటికలపూడి చిట్టి వెంకయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, నతానియేలు, ఏవీ కృష్ణారావు, ఈదర ప్రసాదరావు, పీవీ శేషాచార్యులు, టీవీఎస్ సన్యాసిరావు, జి వెంకట్రావు, ఎం అలివేలుమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో గొబ్బిళ్ల సంబరాలు

భీమవరం: స్థానిక గునుపూడి బంట్రోతువారి వీధిలోని శ్రీకృష్ణ భగవాన్ స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 50 మంది చిన్నారులతో గొబ్బిళ్ల సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మన సంస్కృతి సాంప్రదాయాలలో పండుగలు ప్రధాన భాగమని పండుగ విశిష్టతను నేటి చిన్నారులకు తెలియజేయాలనే ప్రతివారం శ్రీకృష్ణ భగవాన్ స్వామివారి ఆలయంలో గొబ్బిళ్ల సంబరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం దాతల సౌజన్యంతో చిన్నారులకు చిరు కానుకలు అందజేశారు.

పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

భీమవరం: జిల్లా పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు దంపతులతో పీఈడబ్ల్యూఏ- ఏపీ 2024 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మణ స్వామి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి విజయాలు కలగాలని అన్నారు. కార్యదర్శి డి.కుమారస్వామి మాట్లాడుతూ నూతన సంవత్సరాల్లో సంఘ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సంఘం చేస్తున్న అభివృద్ధి పనుల గురించి చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎ.సూర్యనారాయణ, కోస్తాంధ్ర పద్మ శాలి యువత అధ్యక్షుడు బి.పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.